తొలి మహిళా మేయర్

- బండ్లగూడ మేయర్‌గా బాధ్యతలు స్వీకరించిన లతాప్రేమ్‌గౌడ్
- డిప్యూటీ మేయర్‌గా రాజేందర్‌రెడ్డి
- మంచినీటి సమస్య పరిష్కారమే ధ్యేయం

బండ్లగూడ, మే 24: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ తొలి మహిళా మేయర్‌గా మద్దెల లతాప్రేమ్‌గౌడ్‌శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. గత మేయర్ మహేందర్‌గౌడ్‌పై అవినీతి ఆరోపణలతో అవిశ్వాస తీర్మానం చేసిన విషయం విదితమే. కార్పొరేషన్‌లో ప్రస్తుతం 21మంది కార్పొరేటర్లు ఉన్నారు. కార్పొరేషన్ కార్యాయంలో ఆర్డీవో (రిటర్నింగ్ అధికారి) వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో నూతన మేయర్ ఎన్నిక జరిగింది. మేయర్ అభ్యర్థిగా లత ప్రేమ్‌గౌడ్‌ను డిప్యూటీ మేయర్ రాజేందర్ రెడ్డి బలపర్చగా, డిప్యూటీ మేయర్ పూల పల్లి రాజేందర్‌రెడ్డిని కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి బలపర్చరారు. 17 మంది కార్పొరేటర్లు హాజరై చేతులు తమ సమ్మతి తెలిపారు. ఆర్డీవో వెంకట్‌రెడ్డి మేయర్ లతతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం కమిషనర్ శరత్‌చంద్ర సమక్షంలో వారు బాధ్యతలను స్వీకరించారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని వార్డుల్లో పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకుని స్థానిక కార్పొరేటర్ల సహాయంతో పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని మేయర్ లత తెలిపారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకొస్తే సంబంధిత అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామన్నారు.

నీటి సమస్య పరిష్కారమే లక్ష్యం

బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మంచినీటి సమస్య తీవ్ర స్థాయిలో ఉంది. తద్వారా ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హిమాయత్‌సాగర్ నుంచి నీటిని విడుదల చేయించి కార్పొరేషన్‌కు నీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మేయర్ తెలిపారు.

కమిషనర్ శరత్‌చంద్ర సమక్షంలో మేయర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ తొలి మహిళా మేయర్ లతాప్రేమ్ గౌడ్

నూతన మేయర్‌కు శుభాకాంక్షల వెల్లువ

బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ నూతన మేయర్‌గా బాధ్యతలు స్వీకరించిన లతాప్రేమ్‌గౌడ్‌కు ఎంపీ రంజిత్‌రెడ్డి, రాష్ట్ర పాడిపరిశ్రమల అభివృద్ధి శాఖ చైర్మన్ బోర జ్ఞానేశ్వర్, డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్లతో పాటు నాయకులు పెద్ద ఎత్తున విచ్చేసి శుభాకాంక్షలు తెలిపారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న మేయర్ లత

మేయర్ లతకు నియామకపత్రాన్ని అందజేస్తున్న ఆర్డీవో వెంకట్‌రెడ్డి

నేడు ఇప్టా ఆవిర్భావ వేడుకలు

హిమాయత్‌నగర్, మే 24: ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్న ఇండియన్ పీపుల్స్ థియేటర్స్ అసోసియేషన్ (ఇప్టా) 81వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శనివారం రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థ మూల సిద్ధాంతాలను ధ్వంసం చేసి ప్రజల మధ్య అంతరాలు సృష్టించేందు కు ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయన్నారు. హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్ వద్ద జరిగే కార్యక్రమానికి కళాకారులు అధిక సంఖ్యల్లో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సమస్యలు పరిష్కారం చేయాలి

హిమాయత్‌నగర్, మే 24: రాష్ట్రంలో యువజనులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారం చేసేందుకు ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర డిమాండ్ చేశారు. శుక్రవారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. యువతకు ఇచ్చిన హామీలను మోదీ నెరవేర్చకుండా పదేండ్లుగా కాలయాపన చేశారని విమర్శించారు. దేశంలో రోజురోజుకు నిరుద్యోగ సమస్య జఠిలమవుతుందని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించకపోవడంతో యువత ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వివిధ దశలో నిలిచిపోయిన ఉద్యోగాలను భర్తీ చేయడంతో పాటు కొత్త ఉద్యోగాల భర్తీ కోసం నోటిఫికేషన్లు విడుదల చేయాలని అన్నారు. యువజనుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ఏఐవైఎఫ్ పోరాటం చేస్తుందని తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

అనిల్ (ఫైల్)

శంషాబాద్ రూరల్, మే 24: వాకింగ్‌కు వెళ్లి వ్యక్తి అదృశ్యమైన సంఘటన శుక్రవారం శంషాబాద్ ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ బాలరాజు వివరాల ప్రకారం.. శంషాబాద్ పట్టణంలోని ప్రకాశ్‌నగర్‌కాలనీకి చెందిన అనిల్(40) ఏడాది క్రితం పక్షవాతం రావడంతో ఇంట్లో ఉంటున్నాడు. రోజు సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు శంషాబాద్‌లోని ప్రభుత్వ పాఠశాల మైదానంలో వాకింగ్‌కు వెళ్లి తిరిగి వస్తాడు. గురువారం అతడు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఎక్కడ వెతికినా ఫలితం లేకపోవడంతో అతడి భార్య సబిత పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

బండ్లగూడ, మే 24: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీఎన్‌రెడ్డి ప్రాంతానికి చెందిన శిశుపాల్‌రెడ్డి(49) డీసీఎం వాహనంలో అవుటర్ రింగ్‌రోడ్డు గుండా శంషాబాద్ నుంచి గచ్చిబౌలికి వెళ్తున్నాడు. కాగా రాజేంద్రనగర్ అవుటర్ రింగ్‌రోడ్ వద్ద ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టాడు. దీంతో డీసీఎం స్టీరింగ్ కడుపులో గుచ్చుకుని తీవ్రగాయాల పాలైన శిశుపాల్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

పోరాట యోధుడు.. నల్లమల గిరిప్రసాద్

హిమాయత్‌నగర్‌లో గిరిప్రసాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, నాయకులు

హిమాయత్‌నగర్, మే 24: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు నల్లమల గిరిప్రసాద్ సేవలు మరువలేనివని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఐ జాతీయ నేత పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు.

నల్లమలగిరి ప్రసాద్ 27వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం హిమాయత్‌నగర్‌లోని మఖ్దూం భవన్‌లో గిరిప్రసాద్ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..

గిరిప్రసాద్ నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి పార్టీకి, సమాజానికి సేవ చేశారని పేర్కొన్నారు. ఆయన గొప్ప విజ్ఞానవంతుడు, పోరాటయోధుడని కొని యాడారు. ప్రజా సమస్యలు, పాలకుల విధానాలపై ఆయన రాసిన వ్యాసాలు ప్రజల్లో చర్చనీయాంగా మారాయని గుర్తుచేశారు. గిరిప్రసాద్ జీవితం అందరికీ ఆదర్శమని, ఆయన ఆశయ సాధనకు కృషి చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు పశ్య పద్మ, ప్రభాకర్, ఎన్.జ్యోతి, సృజన, కాంతయ్య, ఆర్.అంజయ్యనాయక్, పల్లె నరసింహ, విలాస్, వెంకట్, శ్రీనివాస మూర్తి తదితరులు పాల్గొన్నారు.

హల్వా తిని అస్వస్థత.. కేసు నమోదు

ఖైరతాబాద్, మే 24: లక్డీకాపూల్‌లోని ఓ హోటల్‌లో హల్వా తిని ఓ మహిళ అస్వస్థతకు గురైంది. ఖైరతాబాద్ సీఐ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. మల్కాజిగిరిలోని వీనాపాణినగర్‌కు చెందిన కె.ప్రవంతి ఈనెల 23న కుటుంబ సభ్యులతో కలిసి లక్డీకాపూల్‌లోని ద్వారకా హోటల్‌కు వచ్చారు. క్యారెట్, మూంగ్‌దాల్ హల్వాను ఆర్డర్ చేశారు. పార్శిల్ చేయించుకొని ఇంటికి తీసుకెళ్లారు. క్యారెట్ హల్వాను ప్రవంతి తింటుండగా పాచిన వాసన వచ్చింది. మూంగ్‌దాల్ హల్వా కూడా అదే తీరులో ఉంది. దీంతో హోటల్‌కు వెళ్లి నిలదీయగా నిర్లక్షపు సమాధానమిచ్చారు. అప్పటికే కొంత హల్వాను తిన్న ప్రవంతికి వాంతులు మొదలయ్యాయి. దీంతో బాధితురాలు ప్రవంతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు హోటల్ నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

డిన్నర్ చేసి వచ్చేసరికి ఆభరణాలు మాయం

బంజారాహిల్స్, మే 24: రెస్టారెంట్‌లో డిన్నర్ చేసి వచ్చేసరికి కారులో పెట్టిన ఆభరణాలు మాయమయ్యాయి. ఈ ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్ నం. 12లోని ఎమ్మెల్యే కాలనీకి చెందిన జైద్ అహ్మద్ వ్యాపారి. ఈ నెల 22న రాత్రి 9.15 గంటల సమయంలో బంజారాహిల్స్ రోడ్ నం.12లోని సెవెన్ సిస్టర్స్ రెస్టారెంట్‌లో డిన్నర్ కోసం భార్యతో కలిసి వచ్చాడు. కారును వ్యాలెట్ డ్రైవర్‌కు ఇచ్చిన జైద్ అహ్మద్.. గంట తర్వాత డిన్నర్ ముగించుకుని బయటకు వచ్చారు. ఇంటికి వెళ్తున్న క్రమంలో డ్యాష్ బోర్డులో దాచిన ఏడు గ్రాముల బంగారం బ్రాస్‌లెట్, 4 గ్రాముల ఉంగరం కనిపించలేదు. కారును పార్క్ చేసిన వ్యాలెట్ డ్రైవర్‌పై అనుమానం వ్యక్తం చేస్తూ శుక్రవారం బాధితుడు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఐపీసీ 379 సెక్షన్ కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

సెల్‌ఫోన్ స్నాచింగ్

వెంగళరావునగర్, మే 24: నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తి చేతిలో నుంచి గుర్తితెలియని ఆగంతకులు సెల్‌ఫోన్ లాక్కుని ఉడాయించిన సంఘటన మధురానగర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లాకు చెందిన చింతల తాడెం పరుశురాం సౌత్ సెంట్రల్ రైల్వేస్‌లో ఇంజినీర్‌గా పనిచేస్తూ ఎల్లారెడ్డిగూడలోని సాయిసదన్ బాయ్స్ హాస్టల్‌లో ఉంటున్నారు. గురువారం రాత్రి విధులు ముగించుకుని హాస్టల్‌కు వెళ్లేందుకు ఇంజినీర్స్‌కాలనీ వద్ద నడుచుకుంటూ వెళ్తుండగా ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు ఆగంతకులు చేతిలోని సెల్‌ఫోన్‌ను లాక్కొని ఉడాయించారు. దీంతో బాధితుడు మధురానగర్‌నగర్ పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

28 నుంచి కౌంటింగ్ ఏర్పాట్లు..

స్ట్రాంగ్ రూంల వద్ద అధికారులతో జిల్లా అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

జూబ్లీహిల్స్, మే 24: లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్ ఏర్పాట్లకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో కౌంటింగ్ నిర్వహించనున్న సంగతి తెలిసిందే. ఇండోర్ స్టేడియంలో స్ట్రాంగ్ రూమ్‌లో బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్‌లను భద్రపరిచిన అధికారులు మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. కాగా ఇందులోనే కౌంటింగ్ హాల్‌ను కూడా ఏర్పాటు చేసిన అధికారులు ఈనెల 28 నుంచి కౌంటింగ్ ఏర్పాట్లు చేయనున్నారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో 329 పోలింగ్ బూత్‌లకు గానూ 14 టేబుల్స్ ఏర్పాటుచేయనున్నట్లు సికింద్రాబాద్ ఆర్డీఓ, జూబ్లీహిల్స్ అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ దశరథ్ సింగ్ రాథోడ్ తెలిపారు. స్ట్రాంగ్ రూమ్‌లతో పాటు కౌంటింగ్ కేంద్రం వద్ద ప్రత్యేక పోలీసు బలగాలను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. కౌంటింగ్ సిబ్బందిని సంసిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. ఎన్నికల సంఘం నియమ నిబంధనలను అనుసరించి జూన్ 4న అన్ని రాజకీయ పార్టీల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లను తెరిచి కౌంటింగ్ చేపట్టనున్నట్లు తెలిపారు.

మనీ సర్క్యులేషన్ స్కీమ్ పేరుతో మోసం

బంజారాహిల్స్,మే 24: మనీ సర్క్యులేషన్ స్కీమ్‌లో పెట్టుబడి పెడితే లాభాలు వస్తాయంటూ నమ్మించి మోసం చేసిన వ్యక్తులపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. వెంకటగిరిలో నివాసి బంగి రవి కుమార్ ప్రభుత్వ ఉద్యోగి. రెండేండ్ల కిందట అతడికి ఇందిరానగర్‌కు చెందిన కొండా రవి పరిచయమయ్యాడు. తాము కనకలక్ష్మి సేవింగ్స్ పేరుతో మనీ సర్క్యులేషన్ స్కీమ్ పెట్టామని, నెలకు రూ.2 వేలు చెల్లిస్తే లాభాలు వస్తాయని, మధ్యలో లక్కీ డ్రా ద్వారా బహుమతులు కూడా వస్తాయని నమ్మించాడు. దీంతో 22 నెలల పాటు డబ్బులు కట్టిన తర్వాత కొండా రవి బిచాణా ఎత్తేశాడు. ఇటీవల ఈ విషయం తెలుసుకున్న బాధితుడు తాను మోసపోయినట్లు గ్రహించి.. బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఐపీసీ 420తో పాటు సెక్షన్ 3,4 ఆఫ్ ప్రైజ్ చిట్స్ అండ్ మనీ సర్క్యులేషన్ స్కీమ్స్ బ్యానింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధిద్దాం

ఎన్‌టీపీసీ ఆధ్వర్యంలో పెయింటింగ్ పోటీలు

తాము వేసిన పెయింటింగ్‌లను ప్రదర్శించిన విద్యార్థులు

బన్సీలాల్‌పేట్, మే 24: నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్‌టీపీసీ) సంస్థ ఆధ్వర్యంలో భోలక్‌పూర్‌లోని మేకలమండి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పెయింటింగ్ పోటీలను నిర్వహించారు. శుక్రవారం పోటీలను ప్రారంభించిన ఎన్‌టీపీసీ సంస్థ డీజీఎం బద్రుద్దీన్ అన్సారీ మాట్లాడుతూ, దక్షిణ ప్రాంతీయ కేంద్ర కార్యాలయం ద్వారా చేపడుతున్న కార్పొరేట్ సంస్థల సామాజిక బాధ్యత కార్యక్రమాలలో భాగంగా మే 16 నుంచి 31 వరకు స్వచ్ఛతా పక్షోత్సవాలను నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులలో పర్యావరణం గురించి, ప్లాస్టిక్ వినియోగం వలన కలిగే అనర్థాల గురించి అవగాహన కల్పించేందుకు 'ప్లాస్టిక్ వాడకాన్ని నివారిద్దాం' అనే అంశంపై చిత్రలేఖనం పోటీలను చేపట్టామని అన్నారు. రోజు వారి కొనుగోళ్ళలో ప్లాస్టిక్ వాడకాన్ని వీలైనంత వరకు తగ్గించి, పర్యావరణానికి హాని కలగకుండా ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. విజేతలను ఎంపిక చేసి నెలాఖరులో బహుమతులను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎన్‌టీపీసీ మేనేజర్ ప్రియాంక భూయాన్, పాఠశాల హెచ్ఎం మల్లికార్జున్ రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను కలిసిన మణికంఠ భక్త సమాజం సభ్యులు

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ

అత్తాపూర్, మే 24: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడూ పరిష్కరిస్తానని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ అన్నారు. అత్తాపూర్ మణికంఠ భక్త సమాజం అధ్యక్షుడు మిద్దెల సురేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. అత్తాపూర్ గ్రామంలోని గ్రామ దేవతల ఆలయాలకు వెళ్లే రహదారుల నిర్మాణం, రహదారుల మరమ్మతులు త్వరితగతిన చేపట్టాలని ఎమ్మెల్యేకు వివరించారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించి త్వరలోనే అభివృద్ధి పనులను జరుగుతాయని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సురేందర్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, శివారెడ్డి, పీఎం రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలకు ఇక చెల్లు

- నిబంధనలు అతిక్రమిస్తే నేల కూలాల్సిందే..
- 27 నుంచి అక్రమ నిర్మాణాల కూల్చివేతలు
- నార్సింగి మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారిణి మణిహారిక

మణికొండ, మే 24: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో పలు ప్రాంతాల్లో నిబంధనలను అతిక్రమించి నిర్మించిన అక్రమ నిర్మాణాలు నేల కూలనున్నాయి. ఈనెల 27న విజిలెన్స్, హెచ్ఎండీఏ, రెవెన్యూ, పోలీస్, టౌన్‌ప్లానింగ్ విభాగాలు సంయుక్తంగా కలిసి అక్రమ నిర్మాణాలను కూల్చివేయనున్నట్లు నార్సింగి మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారిణి మణిహారిక శుక్రవారం వెల్లడించారు. కొన్ని రోజులుగా ఇష్టానుసారంగా నిర్మాణదారులు మున్సిపాలిటీ పరిధిలోని నార్సింగి, కోకాపేట, గౌలిదొడ్డి, మంచిరేవుల, నార్సింగి గ్రామాల్లో నిబంధనలకు విరుద్ధంగా అనుమతుల పొందారు. అంతేగాకుండా అదనంగా నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. ఎన్నికల హడావిడిలో అధికారులు అందుబాటులో ఉండరని భావించి చాలా చోట్ల అక్రమ నిర్మాణాలు పుట్టగొడుగుల్లా వెలిశాయని పేర్కొన్నారు. వీటిని గుర్తించి రెండు పర్యాయాలు నోటీసులు జారీ చేసినా ఎలాంటి స్పందన రాకపోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వచ్చే సోమవారం నుంచి కూల్చివేతల ప్రక్రియ కొనసాగుతుందని వెల్లడించారు. అక్రమ నిర్మాణాల్లో అమాయక ప్రజలు ఎలాంటి కొనుగోలు చేయవద్దని ఆమె సూచించారు. ఈ విషయంలో ఎంతటి వారైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని ఆమె స్పష్టం చేశారు.

స్కూల్ యూనిఫాం పనులు షురూ..

పొదుపు మహిళా సంఘాలకు స్కూల్ యూనిఫాం క్లాత్‌ను పంపిణీ చేస్తున్న డీపీఓ వెంకటకిషన్‌రావు

జూబ్లీహిల్స్, మే 24: జూన్ 12న పాఠశాలలు ప్రారంభం అయ్యేలోపు స్కూల్ యూనిఫాం సిద్ధం చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సర్కారు బడులు తెరిచిన మొదటి రోజే యూనిఫాం అందజేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జీహెచ్ఎంసీ అర్బన్ కమ్యునిటీ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో పొదుపు సంఘాల మహిళలు స్కూల్ యూనిఫాంలు సిద్ధం చేసే పనులను చేపడుతున్నారు. శుక్రవారం యూసుఫ్‌గూడ సర్కిల్‌లో మహిళా సంఘాలకు యూసీడీ డిప్యూటీ ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకటకిషన్‌రావు స్కూల్ యూనిఫాం క్లాత్‌ను పంపిణీ చేశారు. ఆయా సంఘాల మహిళలు ఏకరూప దుస్తులను సిద్ధంచేసే పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. టౌన్ లెవల్ ఫెడరేషన్, స్లమ్ లెవల్ ఫెడరేషన్ పరిధిలోని పొదుపు సంఘాల మహిళలు పాఠశాలల ప్రారంభానికి వారం ముందే స్కూల్ యూనిఫాంలు సిద్ధం చేసి ఉంచుకోవాలని సూచించారు.

బస్తీ దవాఖానల్లో నాణ్యమైన వైద్య సేవలు



యూసుఫ్‌గూడ బస్తీ దవాఖానలో రికార్డులను తనిఖీ చేస్తున్న ఎస్పీ,హెచ్ఓ డాక్టర్ రేవతి

జూబ్లీహిల్స్, మే 24: బస్తీ దవాఖానల్లో అందిస్తున్న నాణ్యమైన వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని అమీర్‌పేట్ ఎస్పీ,హెచ్ఓ డాక్టర్ రేవతి పేర్కొన్నారు. బస్తీ దవాఖానల్లో అన్ని రకాల పరీక్షలు, వైద్యం, మందులు అందుతున్నాయని అన్నారు. శుక్రవారం యూసుఫ్‌గూడ బస్తీ దవాఖానను సందర్శించి వైద్య సేవలను పరిశీలించడంతో పాటు రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ చిన్మయి శ్రీరంగ, ఆశా వర్కర్ సంగీత తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు బటర్ మిల్క్ పంపిణీ

నారాయణగూడలోని భూలక్ష్మి ఆలయం ఆవరణంలో శుక్రవారం భక్తులకు ఆలయం కమిటీ బటర్ మిల్క్ పంపిణీ చేసింది. వేసవి తీవ్రత వల్ల అమ్మవారి దర్శనం చేసుకునేందుకు వచ్చిన భక్తులకు, ప్రయాణికులకు వడదెబ్బ తగలకుండా ఉండేందుకు బటర్ మిల్క్ పంపిణీ చేశామని భూలక్ష్మి ఆలయ కమిటీ చైర్మన్ డి.శ్రీనివాస్ ప్రసాద్‌గౌడ్ తెలిపారు. – హిమాయత్‌నగర్